# అరవయేండ్లు ఆగం చేసినోళ్లు ఇప్పుడేం చేస్తారు?

- కాంగ్రెస్ మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు
- గ్యారంటీ హామీలతో నవ్వుల పాలు
- బీఆర్ఎస్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షం
- అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి
- కాంగ్రెస్, బీజేపీ నుంచి పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరిక

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 31 : అరవై ఏండ్లు ఆగం చేసినోళ్లు ఇప్పుడేదో చేస్తామంటే అంతా నవ్వుకుంటున్నారని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట, ఆత్మకూర్ (ఎస్) మండలాల పరిధిలోని ఎనుబాముల గ్రామానికి చెందిన సుమారు 100 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో గల పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరినీ మంత్రి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరణం చివరి అంచుల వరకు పోయి పోరాడి సాధించిన తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధికి చిరునామాగా మార్చినట్లు తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలంతా రుణపడి ఉంటామని గర్వంగా చెబుతున్నారన్నారు. అందుకే ఆయా పార్టీల్లో ఇక ఉండలేక గులాబీ గూటికి చేరుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ గ్యారెంటీలను చూసి ప్రజలంతా నవ్వుకుంటున్నారు తప్పా నమ్మే పరిస్థితిలో ఎవరూ లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ ప్రజలకు అవసరమైన అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించడం లేదన్నారు. అక్కడ అమలు చేయలేని హామీలను ఇక్కడ అమలు చేస్తామనే మోసపూరిత హామీలను ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదన్నారు. కేసీఆరే తెలంగాణకు సరైన నాయకుడు అని ప్రజలంతా నమ్ముతున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీల నుంచి బోళ్ల లింగారెడ్డి, బోళ్ల పద్మ, సత్తిరెడ్డి, రాకేశ్‌రెడ్డి, మల్లారెడ్డి, ఉపేందర్‌రెడ్డి, సంపత్, మరియమ్మ, నాగలక్ష్మి, స్పందన, వెంకటమ్మతో పాటు సుమారు 100 మంది బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, ఎంపీటీసీ నాగేంద్ర సుందర్, సర్పంచ్ షేక్ మీరా, నాయకులు మర్ల చంద్రారెడ్డి, గండమళ్ల నాగయ్య, పాషా, అండెమ్ శేఖర్, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

### రామచంద్రు కుటుంబానికి మంత్రి పరామర్శ

ఆత్మకూర్.ఎస్ : మండలంలోని నెమ్మికల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బెల్లంకొండ రామచంద్రు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మంత్రి జగదీశ్‌రెడ్డి రామచంద్రు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రి వెంట జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తూడి నర్సింహారావు, బత్తుల రాజేంద్రప్రసాద్, బెల్లంకొండ యాదగిరి, సర్పంచ్ గంపల దావీదు, ఎంపీటీసీ ఎడవల్లి ముత్తయ్య, రేణిగుంట్ల ఉపేందర్, ఎడవెల్లి చిన ముత్తయ్య, పచ్చిపాల లింగయ్య, బ్రహ్మం, బొల్లపాక సైదులు, వేల్పుల వెంకన్న ఉన్నారు.


సూర్యాపేటరూరల్ : రామారంలో మంత్రి జగదీశ్‌రెడ్డిని గెలిపించాలని ఓటు అభ్యర్థిస్తున్న జడ్పీటీసీ భిక్షం


సూర్యాపేటటౌన్ : పట్టణంలోని 16వ వార్డులో ప్రచారం చేస్తున్న మంత్రి సతీమణి గుంటకండ్ల సునీత

## లక్ష్మీనరసింహుడికి వైభవంగా నిత్యారాధనలు


యాదగిరిగుట్ట ఆలయ మాడవీధుల్లో స్వామి, అమ్మవార్ల జోడు సేవోత్సవం

యాదగిరిగుట్ట, అక్టోబర్ 31 : యాదగిరిగుట్ట ప్రధానాలయంలో లక్ష్మీనరసింహ స్వామికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. మంగళవారం తెల్లవారుజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను కనులపండువగా నిర్వహించారు. స్వామివారికి సుదర్శన నారసింహ హోమం ఘనంగా జరిపారు. సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం చేశారు. స్వామి, అమ్మవార్లను పట్టువస్త్రాలతో అలంకరించి గజవాహన సేవ నిర్వహించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరుకల్యాణోత్సవం జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా సాగాయి. స్వామివారిని సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ. రూ. 13,78,749 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్. గీత, అనువంశికధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

## న్యాయ వ్యవస్థకు వెన్నెముక న్యాయవాదులు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

సూర్యాపేటలీగల్, అక్టోబర్ 31 : న్యాయ వ్యవస్థకు న్యాయవాదులు వెన్నుముక వంటివారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం కోసం న్యాయవాదులు తమ వంతు కృషి చేయాలన్నారు. గత నెల నిర్వహించిన లోక్ అదాలత్‌లో 18 వేల కేసులు పరిష్కారం అయ్యాయని, అందుకు సహకరించిన న్యాయవాదులను అభినందిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రశంసాపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, ప్రధమ శ్రేణి న్యాయమూర్తి కె.సురేశ్, అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్, కార్యదర్శి పి.నర్సయ్య, ప్రాసిక్యూటర్ కె.లింగయ్య, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రామ్‌రెడ్డి, ఎన్.నవీందర్‌కుమార్, ప్రభుత్వ న్యాయవాది ఎం.రమేశ్, న్యాయవాదులు టి.శ్రీనివాస్, జె.శశిధర్, వెంకటబుచ్చేశ్వర్‌రావు పాల్గొన్నారు.

## జాతి సమైక్యతకు పునరంకితం అవుదాం

- ఎస్పీ రాహుల్ హెగ్డే


సూర్యాపేటసిటీ : ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేటసిటీ, అక్టోబర్ 31 : జాతి సమైక్యతకు పునరంకితమై మాతృ దేశానికి మన వంతు సేవ చేయడమే స్వాతంత్ర్య సమరయోధులకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. జాతీయ ఏక్తా దివస్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి ఎస్పీ రాహుల్ హెగ్డే పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం సిబ్బందితో ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ శ్రీనివాస్, సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎస్ఐలు ఐలయ్య, కుశలవ, ఆర్ఎస్ఐ సాయిరాం, ఎస్పీ సీసీ సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

### ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేయాలి

నేరేడుచర్ల / గరిడేపల్లి : ఎన్నికల నిమావళిని పోలీస్ సిబ్బంది పటిష్టంగా అమలు చేయాలని ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు. నేరేడుచర్ల, గరిడేపల్లి పోలీస్ స్టేషన్లను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల బందోబస్తు ఏర్పాట్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహణ, సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా, అక్రమ రవాణ, ప్రలోభాల నిరోధం మొదలైన అంశాలపై కూలంకషంగా చర్చించి పలు సూచనలు చేశారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, సమస్యలు సృష్టించే వ్యక్తులను బైండోవర్ చేయాలని సూచించారు. గ్రామాల్లో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట కోదాడ డీఎస్పీ ప్రకాశ్, సీఐలు లింగారెడ్డి, రాజేశ్, ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, పరమేశ్ ఉన్నారు.

# అభివృద్ధి ప్రదాతకు అండగా ఉండాలి

- మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

సూర్యాపేట టౌన్, అక్టోబర్ 31 : 2014కు ముందు తర్వాత సూర్యాపేటలో జరిగిన అభివృద్ధి మార్పును ప్రజలంతా గమనించి అభివృద్ధి ప్రదాత మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి అండగా ఉండాలని ఆయన సతీమణి సునీత కోరారు. మంగళవారం సూర్యాపేట పట్టణంలోని 16వ వార్డులో వార్డు నాయకులు, మహిళలతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెరవేర్చలేని హామీలతో ఆశ చూపుతున్న పార్టీలను ప్రజలు నమ్మరన్నారు. ఆసరా పింఛన్ల పెంపు, పేదలకు సన్న బియ్యం, రూ.400 కే గ్యాస్ సిలిండర్, మహిళలకు భృతి ఇలా అనేక రకాల దమ్మున్న పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడం ఒక్క బీఆర్ఎస్ పార్టీకే సాధ్యమని పేర్కొన్నారు.

### మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

సూర్యాపేట రూరల్ : రానున్న ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ సూర్యాపేట అభ్యర్థి, మంత్రి జగదీశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. మండలంలోని రామారం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాలవరపు వేణు, బొల్లం నాగరాజు, వెంకన్న, శ్రీను పాల్గొన్నారు.

## పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు


పుట్టిన రోజు జరుపుకుంటున్న పెన్షనర్లు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 31 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో 15 మంది పెన్షనర్లకు సామూహిక జన్మదిన వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించి శాలువాలు, మెమోంటోలతో సత్కరించి భారీ కేక్‌ను కట్ చేయించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు ఎస్.ఎ.హమీద్‌ఖాన్, వి.కృపాకర్‌రెడ్డి, టి.లక్ష్మీకాంతరెడ్డి, ఎస్.నాగేశ్వర్‌రావు, జి.సోమయ్య, వి.రాములు, కె.సురేందర్‌రెడ్డి, బి.వీరయ్య, కె.అనంతరెడ్డి, జి.సోమేశ్వర్‌రావు, సీహెచ్.రాములు, హమీద్‌ఖాన్, వెంకన్న, అరుణజ్యోతి, సి.రోజా, భాస్కరచారి, పి.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## లంబాడీ విద్యార్థి సేన తుంగతుర్తి నియోజక వర్గ అధ్యక్షుడిగా రమేశ్‌నాయక్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 31 : లంబాడీ విద్యార్థి సేన తుంగతుర్తి నియోజక వర్గ అధ్యక్షుడిగా తుంగతుర్తి మండలం కేశవాపురం గ్రామ ఆవాసం రాజునాయక్‌తండాకు చెందిన రమేశ్‌నాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలునాయక్ మంగళవారం రమేశ్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో లంబాడి విద్యార్థి సేన జిల్లా అధ్యక్షుడు బానోతు హరీశ్‌నాయక్, సూర్యాపేట నియోజక వర్గ అధ్యక్షుడు నరసింహనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు లకావత్ వీరన్ననాయక్, అశోక్‌నాయక్, సాయినాయక్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాల జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెంకన్న

చివ్వెంల, అక్టోబర్ 31 : మాల జనసేన సంయుక్త రాష్ట్ర కార్యదర్శిగా మర్రి వెంకన్న నియమితులయ్యారు. మంగళవారం మండలంలోని ఐలాపురంలో నిర్వహించిన సంఘం రాష్ట్ర సమావేశంలో వెంకన్నను నియమించినట్లు మాల జనసేన రాష్ట్ర అధ్యక్షుడు గోలి ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.